క్లుప్తంగా

జంగల్‌పేటలో మారమ్మ రథోత్సవం



అమ్మవార్లను రథంలో ఊరేగిస్తున్న భక్తులు

నెన్నెల: మండలంలోని కర్జి, జంగల్‌పేటలో మారమ్మ, సడవలమ్మ రథోత్సవాన్ని మంగళవారం సాయంత్రం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్ల వద్ద పట్నాలు వేసి, పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. సాయంత్రం రథాన్ని విశేష పుష్పాలు, అరటి కొమ్మలతో అలంకరణ చేసి రథంలో అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి ఊరేగించారు. కొబ్బరికాయలు కొట్టి, బోనాలను నైవేద్యాలుగా సమర్పించారు. మేకలు, కోళ్లను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ రథోత్సవానికి కోటపల్లి, పంగిడిసోమారం, నెన్నెల, మైలారం, బోగంపల్లి, దమ్మిరెడ్డిపేట, కోనంపేట, మన్నెంగూడెం గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండి, పిల్లా పాపలతో సల్లంగా ఉండేలా చూడు తల్లి అంటూ భక్తులు వేడుకున్నారు. ప్రతీ సంవత్సరం పసుపు నైవేద్యాలలో భాగంగా ఈ జాతర నిర్వహిస్తామని పూజారులు పట్టిగారి మల్లయ్య, అద్దరపల్లి బాపులు తెలిపారు.

అంతర్గత రోడ్లకు మరమ్మతు చేయించాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న బస్తీ వాసులు

బెల్లంపల్లి: అంతర్గత రోడ్లకు వెంటనే మరమ్మతు చేయించాలని బెల్లంపల్లి మున్సిపాలిటీ 18వార్డు కాంట్రాక్టర్ బస్తీ వాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ బస్తీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. ఏళ్ల తరబడి నుంచి మరమ్మతులకు నోచుకోక తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సారైనా శ్రద్ధ పెట్టి, తగిన చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు రాంమ్మోహన్, శ్రీనివాస్ తదితరులు కోరారు.

అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలి

నస్పూర్: జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న పుస్తకాల విక్రయాన్ని అరికట్టాలని మాదిగ స్టూడెంట్ ఫోరం జిల్లా ఇన్‌చార్జి కోంద్ర ఉదయ్‌మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నాయకులతో కలిసి సీసీసీలో మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి, పాఠశాలలో దుకాణాలు తెరిచి నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అడ్మిషన్ ఫీజుపేరిట విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నారన్నారు. సంబంధిత అధికారులు ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న ఫీజు దోపిడీపై చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న పుస్తకాల విక్రయాలను, అధిక ఫీజు వసుళ్లను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సీపల్లి సాజన్ మాదిగ, గోపికృష్ణ మాదిగ, రిషికుమార్ మాదిగ, మహేశ్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ, శంకర్ మాదిగ, భాస్కర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

దండేపల్లి: మండలంలోని ద్వారక, లక్ష్మీకాంతపూర్, ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎంపీడీవో ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టడంతో పాటు, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వారి వెంట ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం దుర్గదాస్, సీఆర్పీలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణే లక్ష్యం

మంచిర్యాలటౌన్: నులి పురుగుల నివారణే లక్ష్యంగా ఈనెల 20న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్‌బెండజోల్ మాత్రలు 19 ఏళ్లలోపు వారికి పంపిణీ చేయనున్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 1–19 ఏళ్లలోపు పిల్లలకు అల్‌బెండజోల్ మాత్ర అందించాలని సూచించారు. ఆ రోజు హాజరు కానివారికి మాప్ అప్ డే సందర్భంగా ఈ మాత్రను ఇవ్వాలని సూచించారు. 2 ఏళ్లలోపు వసు ఉన్నవారికి సగం మాత్ర పొడిచేసి నీటిలో కలిపి మింగించాలని తెలిపారు. 2–3 ఏళ్ల వారికి ఒక మాత్ర పొడిచేసి నీటిలో కలిపి మిగించాలని సూచించారు. 3–19 ఏళ్ల వారు మాత్ర నమిలి లేదా చప్పరించి మింగాలన్నారు. పిల్లల్లో రక్తహీనత, శారీరక, మానసిక అరోగ్యానికి కారణమయ్యే నులిపురుగును నిర్మూలించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాత మంచిర్యాల, రాజీవ్‌నగర్ వైద్యాధికారులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ అశోక్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సీహెచ్‌వో దీక్షితారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇందిర, సులోచన, రమ, అపర్ణ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నులిపురుగుల నివారణపై అవగాహన

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ వైద్యాధికారి రమేశ్, ఎంపీడీవో రాజేశ్వర్ నులిపురుగుల నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ నెల 20న అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో అల్బెండాజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. గైర్హాజరైన పిల్లలకు ఈ నెల 27న వేయనున్నట్లు వివరించారు.

దండేపల్లి: 1 నుంచి 19ఏళ్ల లోపు వారికి నులిపురుగు నివారణ మాత్రలు తప్పక వేయించాలని ఎంపీపీ శ్రీనివాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, దండేపల్లి, తాళ్లపేట వైద్యులు సతీష్, క్రాంతికుమార్, వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



దండేపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణతేజ మాట్లాడారు. ఒకటి నుంచి 19సంవత్సరాలు కలిగి ఉన్న విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, హెచ్ఈవో జగదీశ్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల కబ్జాపై చర్యలేవి?

- పది రోజుల్లో చర్యలు తీసుకోవాలి
- సర్వసభ్య సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా వ్యవహరించాలని సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: మండలంలో పలు చెరువులు కబ్జాకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో సర్వే చేసి చర్యలు తీసుకోవాలని చెప్పినా, ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న వెంటనే నోటీసులు పంపాలని తెలియదా.. ఆలస్యం చేయడం ఏంటి. మరో పది రోజుల్లో కబ్జా విషయంలో చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ సరోజన అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులు చదివిన నివేదికలు విని ప్రశ్నలు అడిగారు. కడెం ప్రాజెక్టు కెనాల్ ఇరువైపులా భూమిని కబ్జా చేసుకుంటున్నా, అధికారులు నోరు తెరువడం లేదని, అదే విధంగా చెరువుల భూమిని కూడా కబ్జా చేస్తున్నారని సభ్యులు మున్వర్‌అలీఖాన్, వినయ్‌కుమార్ ఆరోపించగా అధికారులపై ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చెరువుల కబ్జాపై సంయుక్తంగా సర్వే చేసి పరిష్కారించాలని ఆదేశించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, నీటి రంగాల్లో ప్రజలకు అన్ని సౌకర్యాలు కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పేద విద్యార్థికి విద్య అందేలా చూడాలని, పాఠశాలల్లో సౌకర్యాల కోసమే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అభివృద్ధి పనులు చేపిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ప్రసవాలు జరగడం లేదని, ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారని వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఎంపీటీసీ రియాజోద్దీన్‌లు ఆరోపించారు. ఆసుపత్రులలోనే డెలివరీలు అయ్యేలా చూడాలని సమస్య ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ వైద్యం అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదన్నారు. వ్యవసాయం కోసం ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్తనాలు రైతులకు అందేలా చూడాలన్నారు. చివరి సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలకు అభినందనలు తెలిపారు. మరోమారు ఎంపీటీసీగా అవకాశం పొందాలని, బిల్లులు ఆగినా, ఇతర ఏ సమస్య ఉన్నా నా వద్దకు రావాలని పార్టీలకు అతీతంగా బిల్లులందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘాల నాయకులు

జన్నారం: ప్రభుత్వం చెప్పిన విధంగా కుల జనగణన పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాల పోరాట సమితి నాయకులు కోరారు. ఈ విషయంపై మంగళవారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ జనాభా ఎక్కువగా ఉన్నందునా, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కుల జనగణన పూర్తయిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల పోరాట సమితి జిల్లా, రాష్ట్ర నాయకులు నర్సింహులు, కడార్ల నర్సయ్య, గూడ అశోక్, ఐలవేని రవి, వినయ్‌కుమార్, కొంతం శంకరయ్య, దాసరి శ్రీనివాస్, కొడూరి చంద్రయ్య, శ్రీనివాస్, రాంచందర్, ఆడెపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ



నివాళులర్పిస్తున్న డీఆర్‌డీవో కిషన్, తదితరులు

పాతమంచిర్యాల: గ్రామీణాభివృద్ధి శాఖలో సెర్ప్‌లో అడ్మిన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అర్ల రాజలింగు ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఉద్యోగులు రాజలింగు చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో కిషన్ మాట్లాడుతూ.. ఓ మంచి ఉద్యోగిని కోల్పోయామన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు, ఉపాధి హామీ, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

‘ధాన్యం కొనుగోళ్లలో మోసం చేశారు’



భీమారంలో మాట్లాడుతున్న రైతులు

భీమారం: ధాన్యం కొనుగోళ్లలో తమని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మోసం చేశారని రైతులు ఆరోపించారు. మండల కేంద్రంలో రైతులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తాము కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తూకం వేసిన సమయంలో క్వింటాళ్‌కి 10కిలోల చొప్పున కోతలు విధించారని రైతులు తెలిపారు. ఒకవైపు రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మవద్దని ప్రభుత్వం ప్రకటనలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రాలకు తరలించి ఆరబెట్టిన అనంతరం తూకం వేయించినట్లు తెలిపారు. అయితే ఇష్టారాజ్యంగా కోతలు పెట్టిన నిర్వాహకులు ఫోన్‌కి వచ్చిన ఓటీపీ చెప్పాలని, లేనిచో వరిధాన్యం డబ్బులు ఖాతాల్లో జమ కావని అంటున్నారన్నారు. ఒక వైపు హమాలీలు తూకం వేసిన డబ్బులతో పాటు బస్తాలు కుట్టే సుతిలి కూడా తామే కొనుగోలు చేసి ఇస్తున్నామని రైతులు ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్ తగు విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

హామీలు నెరవేర్చాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: బీసీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందించారు. బీసీ ప్రజల కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, బీసీలు రాజకీయంగా ఎదగడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మనోహర్, నాయకులు కల్యాణం రవి, రాజగురువయ్య, శంకర్, రాజకుమార్, తిరుపతి, ఈశ్వర్, సుధాకర్ పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలు జరిగేలా చూడండి

- ఎమ్మెల్యేకు స్థానికుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: టైగర్‌జోన్ పేరున్న జన్నారం మండలం గుండా సాయంత్రం 9గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు భారీ వాహనాల రాకపోకలను నిషేదించారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాకపోకలు పునరుద్ధరించేలా చూడాలని కోరుతూ మంగళవారం జన్నారం మండలానికి చెందిన సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం ఇచ్చారు. రాకపోకల నిషేదం వల్ల మండలానికి చెందిన వ్యాపారులు, హోటల్ యజమానులు నష్టపోతున్నారని, అంతే కాకుండా జన్నారం మండల అభివృద్ధి కుంటుపడుతోందని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకొని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తాళ్లపేట నుంచి అడవి గుండా రాత్రి, పగలు వాహనాల రాకపోకలు జరిగేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందిన వ్యాపారులు, యువకులు మహేశ్, ఓమేశ్వర్, తదితరులున్నారు.

జోరుగా సాగు పనులు



సూర్జాపూర్‌లో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు

బెల్లంపల్లి: తొలకరి వర్షాలు కురుస్తుండటంతో బెల్లంపల్లి నియోజకవర్గంలో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. వేసవి దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతులు అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పత్తి విత్తనాలు విత్తుకునే పనిలో నిమగ్నమయ్యారు. గడిచిన వారం రోజుల నుంచి కూలీలతో పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు. ప్రధానంగా భీమిని, కన్నెపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో వానాకాలం పంట సాగు పనులు సాగుతుండగా బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల్లో మందకొడిగా జరుగుతున్నాయి. రుతుపవనాల రాకతో రైతులు వ్యవసాయ పనుల్లో తలామునకలయ్యారు. వరి సాగు చేయడానికి పొలాల్లో సేంద్రియ ఎరువులు పోసుకుని, వరి నారు మడులు పోసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఏఐఎస్ఎఫ్ అడహాక్ కమిటీ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ అడహాక్ కమిటీని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ బచ్చలి అభిరాం, కో కన్వీనర్‌గా జీ.సిద్దార్థలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్ మొగిళి లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు కామెర దుర్గా రాజ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు రామగిరి కుమారస్వామి, కాసర్ల రవి, ఏల్పుల సాయి, బచ్చలి హర్షిత్ పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

మంచిర్యాలఅర్బన్: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపించి పరీక్షను మళ్లీ నిర్వహించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ర్యాలీతో పాటు నిరసన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష అవకతవకలపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్, ఎస్ఎఫ్ఐజిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన ఆదివాసీ రైతు సంఘాలు

పోడు రైతుల ధర్నా

మంచిర్యాలఅగ్రికల్చర్: పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులపై అటవీశాఖ అధికారుల దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ ఆదివాసీ, ఇతర పేదలు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గతంలో కొంత మందికి హక్కు పత్రాలు ఇచ్చారని, ఇంకా చాలా మంది పోడు వ్యవసాయ చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందించాలన్నారు. అటవీశాఖ అధికారులు పోడు రైతులపై దాడులు చేస్తూ, అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని వారి దాడులు ఆపాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేలు చొరవ చూపి దాడులను అరికట్టాలన్నారు. వెంటనే పోడు రైతులపై కేసులు ఎత్తివేయాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్యరైతు సంఘ నాయకులు ఎర్మపున్నం, బండారు రవి, సంకే రవి, బగాల రాజన్న, ఎలిగేటి లక్ష్మి, అబ్దుల్లా, అత్రం చిన్న, దోసండ్ల సునీత, రాజు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి



పేదలతో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

దండేపల్లి: అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ భూములు కేటాయించి, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దండేపల్లిలో మంగళవారం పేదలతో జీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. జిల్లా కార్యవర్గ స భ్యులు మేకల దాసు, మండల కార్యదర్శి పెర్క రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌కు సన్మానం

మంచిర్యాలటౌన్: జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్‌ను మంగళవారం పలువురు కలిసి పుష్పగుచ్చం అందించి సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మలయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షుడు కేజియా రాణి, సునిత, శ్రీనివాస్, తిరుపతి, పద్మలత, శ్రావణ్, గోపాల్, అజయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ వి.మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, శంకరయ్య, సత్యనారాయణ రెడ్డి, హరీశ్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

కలెక్టర్‌ను కలిసిన బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు నూతన కలెక్టర్ కుమార్ దీపక్‌ను మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్, ట్రెజర ర్ సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రమేశ్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు కృష్ణ పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికుల తొలగింపు

శ్రీరాంపూర్: నిర్ణీత హాజరు శాతం లేని పలువురు ఉద్యోగులను సింగరేణి యాజమాజ్యం డిస్మిస్ చేసింది. శ్రీరాంపూర్ ఏరియాలో దీర్ఘకాలం విధులకు హాజరు కాని 15 మందిని డిస్మిస్ చేస్తూ యాజమాన్యం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. కొందరికి మంగళవారం ఆర్డర్ కాపీలు అందాయి. హాజరు శాతం తక్కువ ఉన్న కార్మికులకు అధికారులు ఇప్పటికే పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. కొందరు మారి ఉద్యోగాలు చేస్తున్నారు. మరికొందరిలో మార్పు రాలేదు. చివరికి కౌన్సెలింగ్‌కు కూడా దుమ్మా కొట్టారు. దీంతో డిస్మిస్ చేసింది.

సంక్షిప్త వార్తలు

మిషన్ భగీరథ ట్యాంక్ శుభ్రం

చెన్నూర్: మున్సిపాలిటీలోని నాలుగో వార్డు పరిధిలో గల నలగొండ పోచమ్మ వాడలో గల మిషన్ భగీరథ ట్యాంక్‌ను మంగళవారం మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. ఇంటింటికీ శుద్ధజలం సరఫరాలో భాగంగా మిషన్ భగీరథ ట్యాంక్‌లకు నీరు ఎక్కిస్తామని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ట్యాంక్‌ను శుభ్రం చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రెవెల్లి మహేశ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మేకల సంత వేలం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం మేకల సంత బహిరంగ వేలం 20వ తేదీ గురువారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్తు ప్రతిభ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా జీలుగ విత్తనాలు

భీమారం: మండలంలోని గ్రామాల రైతులకు సబ్సిడీపై అందించేందుకు మూడో విడుత జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మార్క్ గ్లాడ్‌స్టన్ మంగళవారం తెలిపారు. రైతులు వర్షాకాలం పంట కోసం పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జీలుగ విత్తనాలు భీమారంలో ఆగ్రోస్ కేంద్రంలో స్టాక్ ఉందని తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టాదార్‌పాస్ పుస్తకాల జిరాక్స్‌లతో రైతువేదిక వద్దకి రావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో అడ్మిషన్‌లు జరుగుతున్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తాటి చెట్లపై పిడుగులు

జైపూర్: మండలంలోని వేలాల, పౌనూర్, శివ్వారం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు చెట్లు నేలకొరగగా పౌనూర్ గ్రామంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో తాటి చెట్లపై పిడుగులు వేయడంతో మంటలు చెలరేగాయి. రెండు తాటిచెట్లు అ గ్నికి ఆహుతయ్యాయి. గాలివానలతో రాత్రి వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.